క్లుప్తంగా

నేడు ప్రవేశ పరీక్ష

మొగుళ్లపల్లి: మండలంలోని కొరికిశాల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల ప్రవేశాల కోసం నేడు (ఆదివారం) మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మీ సేవలో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. ఆరో తరగతిలో 100 సీట్లకు గాను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏడో తరగతి నుంచి పదవ తరగతి వరకు మిగిలిన సీట్లకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్ష సమయానికి అరగంట ముందు చేరుకోవాలన్నారు.

ప్రాంతీయ భాషల్లో పరీక్షలు నిర్వహించాలి

భూపాలపల్లి రూరల్: ప్రాంతీయ భాషల్లో ఉద్యోగ నియామక పరీక్షలు నిర్వహించాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గూగులోత్ సంతోష్ నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హిందీ, ఇంగ్లీషు భాషల్లో మాత్రమే పరీక్షలు నిర్వహించడం వల్ల, ఇతర ప్రాంతీయ భాషల అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల అభ్యర్థులకు సమాన అవకాశాలు ఇచ్చే విధంగా ప్రాంతీయ భాషల్లో పరీక్షలు నిర్వహించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఎస్ఎస్తాడ్వాయి: మండలంలో ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో గృహ నిర్మాణం చేసుకున్న వారు జీఓ 58 అనుసరించి ఇంటి నిర్మాణాలను 1/70 చట్టం ప్రకారం క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. 02-06-2020 సంవత్సరం కంటే ముందు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారు ఈనెల 30 తేదీ వరకు మీసేవలో దరఖాస్తులు చేసుకుని దరఖాస్తు ఫారాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పరామర్శ



మంగపేట: మల్లూరు గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు గోనె లక్ష్మీనారాయణ తల్లి సరోజన శనివారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, పార్టీ నాయకులతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హేమాచల క్షేత్రంలో స్వీపర్‌గా పని చేసే సరోజన మృతి చెందడంపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు జైరాంరెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, బీసీసెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు యానయ్య, భగవాన్‌రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

భూసారం ఆధారంగా పంటల సాగు మేలు

శాయంపేట : భూసారం ఆధారంగా పంటలు సాగు చేస్తే మేలని మారి సంస్థ ప్రతినిధి షేక్ గౌస్ రైతులకు స్పష్టం చేశారు. మండలంలోని జోగంపల్లి గ్రామంలో భూసార పరీక్షలపై రైతులకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడారు. రైతుల వ్యవసాయ భూముల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార ఫలితాల ఆధారంగా అనుకూలమైన పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించుకోచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు మనోహర్‌రావు, హిమబిందు, నవయుగ సొసైటీ డైరెక్టర్ లక్కం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'తపాలా' పథకాలను వినియోగించుకోవాలి

శాయంపేట : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆ శాఖ పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామ్మూర్తి కోరారు. తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలపై మండల కేంద్రంలో శనివారం జరిగిన వారాంతపు సంతలో సిబ్బంది శనివారం విస్తృత ప్రచారం చేశారు. తౌలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి తైబజార్‌లో పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తపాలా శాఖ మహిళల అభ్యున్నతి కోసం 'మహిళా సమ్మాన్' సేవింగ్ సర్టిఫికెట్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. తపాలా శాఖ సేవలను, పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య అధ్యక్షతన మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంపై అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

భూపాలపల్లి రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కో-కన్వీనర్ కట్ల సదయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈ జేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి తలపెట్టిన సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమ్మెలో పాల్గొనేందుకు విద్యుత్ ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు 2014లో 30 శాతం పీఆర్సీ ఇచ్చిందని, 2018లో 35 శాతం ప్రకటించిందన్నారు, 2022లో పీఆర్సీ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చిందన్నారు. విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయనే సాకు చూపేడుతూ.. 6శాతం పీఆర్సీ ఇస్తామనడం సరికాదన్నారు. ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యూలర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయక పోవడంతో ఉన్న ఉద్యోగులపై భారం పడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే 40 శాతం పీఆర్సీ పెంచుతూ ప్రకటన చేయాలని లేదంటే రేపటి నుంచి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెలో పాల్గొంటామన్నారు. సమ్మెలో విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మహాముత్తారం(మల్హర్): తమను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల ప్రొబేషనరి పీరియడ్ పూర్తయిందన్నారు. కానీ ప్రభుత్వం నుంచి ప్రొబేషనరి పిరియడ్ పూర్తయిందని ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 15 రోజుల గడువు ముగిసిన వెంటనే సమ్మెకు సిద్ధంగా ఉంటామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు నగదు అందజేత



నిర్వాహకులకు నగదు అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్తాడ్వాయి: మండలంలోని గంగారంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులకు కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అందించిన రూ.10వేల నగదు ప్రోత్సాహ సాయాన్ని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పార్టీ మండల ఇన్‌చార్జ్ బొల్లు దేవేందర్ శనివారం అందజేశారు. అలాగే భూపతిపూర్ గ్రామంలో కారుకొండా సడాలమ్మ జాతర నిర్వాహకులకు కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.5 వేలు అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రోత్సాహకంగా నగదు అందజేసిన ఎమ్మెల్యే సీతక్కకు టోర్నమెంట్ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, సర్పంచ్‌లు ఇర్ప సునీల్, రేగ కల్యాణి, మంకిడి నరసింహాస్వామి, ఎల్లబోయిన రాంబాబు, యూత్ మండల అధ్యక్షుడు కోడి సతీష్, పీఏసీఎస్ డైరెక్టర్ యానాల సిద్దరెడ్డి, నాయకులు లంజపెల్లి నర్సయ్య, పాలకుర్తి రవి, చిరంజీవి, తల్లడి లక్ష్మయ్య, బడే రాంబాబు పాల్గొన్నారు.

వరంగల్‌కు తరలిన బీజేపీ శ్రేణులు



వరంగల్‌కు వెళ్తున్న నాయకులు

చిట్యాల: వరంగల్‌లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగమార్చ్‌కు మండలంలోని బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, వివిధ మోర్చా నాయకులు, బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు కార్యకర్తలు ఉన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



కనుకమ్మను సన్మానిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం రేగొండ మండలంలోని జూబ్లీనగర్‌లో మేము సైతంలో భాగంగా సీసీ కెమెరాలపై స్థానిక సర్పంచ్ నరేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని కూడలీలలో, రద్దీ ప్రాంతాల్లో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడితే సులభంగా గుర్తించవచ్చని అన్నారు. వ్యాపారులు వ్యాపార సముదాయాలలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి దొంగతనాలకు తావులేకుండా ఉండవచ్చని అన్నారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీల్లో త్వరలోనే అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. గ్రామానికి చెందిన కాసం కనుకమ్మ అనే వృద్ధురాలు ఆమె దినసరి కూలి నుంచి రూ.500విరాళం అందించి ఎంతో మందికి ప్రేరణ కల్పించిందని, ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ విరాళాన్ని ఎస్సైకి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

ముస్లింలకు గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ



గిఫ్ట్ ప్యాక్‌లను అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మంగపేట: మండల కేంద్రంలోని మామేమజీద్ వద్ద ముస్లింలకు ప్రభుత్వం అందజేసిన రంజాన్ పండుగ గిఫ్ట్ ప్యాక్‌లను తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రంజాన్ పండుగను పురస్కరించుకుని 180 గిఫ్ట్ ప్యాకులను పంపడం జరిగిందన్నారు. ఆయా ప్యాక్‌లను మజీద్ కమిటీకి అందజేశామన్నారు. మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల వారిగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు, ఆర్ఐ కుమారస్వామి, మజీద్ కమిటీ ముస్లింలు సయ్యద్ హుస్సేన్, పాషా, మహబూబ్ ఖాన్, ఇంతియజ్ బుట్టో తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఏటూరునాగారం: మండలంలో మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేబీఎస్ఆర్, ఈసీపీఎల్ ప్రతినిధులకు హైదరాబాద్ భగీరథ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్రిమెంట్ ప్రకారం రావాల్సిన జీతాలు ఇవ్వాలని, జీఓ నం .11ను అమలు చేయాలని అన్నారు. పీఎఫ్, వారంతపు సెలవలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

మహదేవపూర్: అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిష్టారావుపేట గ్రామంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిలో సోదాలు నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు అనుమానంగా కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుట్కా, గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీస్‌లు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజారులు

మంగపేట: మండలంలోని కమలాపురం షిరిడి సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం 05 గంటలలకు కాగడ హారతి, 07కు మహాగణపతిపూజా, 7.30కి పుణ్యాహవచనం, 8కి మండపారాధన, 8.30కు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం పూజలను అత్యంత వైభవంగా చేపట్టారు. 10.30 గంటలకు నవగ్రహ హోమం, లక్ష్మీగణపతి హోమం పూజలు జరిపించారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రసన్న



ఏటూరునాగారం : హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్ టోర్నమెంట్‌లో ఏటూరునాగారం స్పోర్ట్స్‌క్లబ్ క్రీడాకారిని జనగం ప్రసన్న 100 మీటర్ల పరుగె పందెంలో పాల్గొన్నట్లు కోచ్ పర్వతాల కుమారస్వామి శనివారం తెలిపారు. నేడు(ఆదివారం) 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో పాల్గొంటునన్నుట్లు తెలిపారు.

విహారయాత్రలో ఆదివాసీ చిన్నారులు



రాష్ట్రపతి భవన్ వద్ద ఆదివాసీ చిన్నారులు

ఎస్ఎస్తాడ్వాయి: మాధవ సేవ మానవ సేవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పస్రా, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాలకు చెందిన ఆదివాసీ చిన్నారులను విహారయాత్రకు తీసుకెళ్లినట్లు ఫౌండర్ వికాజ్ రాజు శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్రపతి భవనాన్ని చూపించినట్లు పేర్కొన్నారు. సునీల్ ఇస్లావత్, సమీర్కుమార్, అనిల్ గంద్రకోట, సంతోష్ మండువ, అరుణ్, కొలిపాక ప్రకాష్, అంబాదాస్, శంకర్ నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

కౌశల్ వికాస్ యోజనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన హోమ్ సైడ్ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ సర్వేయింగ్, మెటల్ వెల్డింగ్ మూడు కోర్సుల నేర్చుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాక భాస్కర్, ట్రైనింగ్ అధికారి శ్రీనివాసరావు, పాపారావు తదితరులు ఉన్నారు.

'ఇఫ్తార్' మత సామరస్యానికి ప్రతీక

శాయంపేట : ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మదీనా మసీదులో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారని తెలిపారు. హిందూ ముస్లిముల ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చిందం రవి, మారంపల్లి రవీందర్, రఫీ, మార్కండేయ, అంకుషావలీ, సర్వర్, రాజ్ మహమ్మద్, నసీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఫ్రిజ్



ఇంట్లో నుంచి బయటకు వస్తున్న పొగ

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సర్పంచ్ పూసం నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మొరుమూరు కాలనీ గ్రామానికి చెందిన ఉయిక రంగారావు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న బట్టలు, బియ్యం, కుక్కర్, ఫ్రిజ్ కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు ఇంట్లో వస్తువులు కాలి పోతున్న విషయం తెలుసుకుని మంటలను ఆర్పారు. దాబా కావడంతో వస్తువులు మాత్రమే కాలి పోయాయి.

త్వరలో డిజిటల్ లైబ్రరీ సేవలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్



బీసీ హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న గోవింద్‌నాయక్, నాయకులు

మంగపేట: మండల కేంద్రంలో త్వరలోనే డిజిటల్ లైబ్రరీ సేవలు అందుబాటులోకి రానున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. రైతు బంధు జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్యతో కలిసి శనివారం లైబ్రరీ ఏర్పాటుకు పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గంపోనిగూడెం సమీపంలోని బీసీ హాస్టల్ భవనంతోపాటు గ్రామ పంచాయతీ భవనంలోని స్టోర్ రూంను పరిశీలించి మాట్లాడారు. మండల కేంద్రంలో జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ కృష్ణ ఆదిత్య సుముకంగా ఉన్నారన్నారు. అందరికి అందుబాటులో ఉండే విధంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్టోర్ రూమ్‌కు వినియోగిస్తున్న రూమ్‌ను డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తే అందరికి అందుబాటులో ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. విషయంపై కలెక్టర్‌కు నివేదిక అందించి మండల కేంద్రంలో త్వరలోనే డిజిటల్ లైబ్రరీ, గ్రంథాలయ సేవలను ప్రారంభిస్తామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, రైతు బంధు సమితి జిల్లా కమిటీ సభ్యులు పచ్చా శేశగిరిరావు, మాజీ జెడ్పీటీసీ శిద్దంశెట్టి వైకుంఠం, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ శిద్దశెట్టి లక్ష్మణ్‌రావు, మండల నాయకులు హరిబాబు, రాజుయాదవ్, గుమ్మల వీరస్వామి, తుక్కాని శ్రీను, తిరుపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై చల్ల రాజు

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి, ఆశిరెడ్డిపల్లి శివారుల్లో ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహన పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు బ్రీత్ ఎన్‌లైజర్‌తో పరీక్షించి పలువురికి జరిమానా విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే ప్రమాదాల బారిన పడుతారని, అంతే కాకుండా రోడ్డు ప్రమాదాల వల్ల శారీరకంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



వాలీబాల్ కిట్లను అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. దేశానికి వెన్నుముక లాంటి యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వావిలాల చిన ఎల్లయ్య, కర్ల తరుణ్ తదితరులు ఉన్నారు.